# ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోలు కీలకం

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్**

హనుమకొండ, అక్టోబర్ 30 : ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు(పీవో), సహాయ ప్రిసైడింగ్ అధికారుల(ఏపీవో)ది కీలక పాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం చైతన్య డిగ్రీ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్‌ను అధికారులు తప్పకుండా చదివి, అందులోని నియమాలను పాటించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. పోలింగ్ సందర్భంగా చేయాల్సిన విధులు, చేయకూడని వాటిపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. శిక్షణ పొందిన రోజు నుండి పోలింగ్ ముగిసే వరకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన ఉద్యోగులు ఎలాంటి పార్టీల అభ్యర్థులకు అనుబంధంగా ఉండవద్దని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కఠినంగా అమలవుతున్నందున జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు, ముందు రోజు చేయాల్సిన పనులను చెక్ లిస్ట్ తయారు చేసుకుని, దాని ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి 90నిమిషాల ముందు అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. శిక్షణ కార్యక్రమాలతో పాటు ఎన్నికల సంబంధించిన మెటీరియల్‌ను ఆయా పోలింగ్ సిబ్బందికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీవో రమేశ్, డీఈవో అబ్దుల్ హై, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఏపీవోల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

**సీ-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలి**

ప్రతి పౌరుడు తన దృష్టికి వచ్చిన ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వాటిని లైవ్ ఫొటోలు, లైవ్ వీడియోలు తీసి సీ-విజిల్ యాప్ ద్వారా పంపాలని సూచించారు. ఈ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై వంద నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. లైవ్ ఫొటోలు, వీడియోలను తీసేటప్పుడు, అప్‌లోడ్ చేసే సమయంలో జీపీఎస్ ఆన్‌లో ఉంచాలని సూచించారు. ఈ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ ద్వారా ఆటోమేటిక్‌గా లోకేషన్ నమోదవుతుందని తెలిపారు. సభలు, సమావేశాల్లో విద్వేషపూరిత కామెంట్స్ చేసినా, పార్టీ అభ్యర్థులు డబ్బులు, మద్యం, బహుమతులు పంచినా, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, ఇతర నిబంధనలు ఉల్లంఘించినా ఈ యాప్ ద్వారా పంపాలని కోరారు. కలెక్టరేట్‌లో 24 గంటలు జిల్లా ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు, సెల్ నెంబర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సీ-విజిల్ యాప్‌ను తమ ఫోన్లలో ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకొని, చుట్టుపక్కల జరుగుతున్న ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు సీ-విజిల్ యాప్‌లో 46 కేసులు నమోదు కాగా, అందులో ఆరు సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. 40కి పైగా ఎన్నికలకు సంబంధం లేనివి ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

## పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ నితేశ్‌వ్యాస్**

హనుమకొండ : రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సక్రమంగా జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ నితేశ్ వ్యాస్ అన్నారు. పోలింగ్ నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నితేశ్‌వ్యాస్ మాట్లాడుతూ నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందనారు. ఈ నెల 10 వరకు నామినేషన్ల స్వీకరణకు ఆర్‌వో కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వచ్చిన ప్రతి నామినేషన్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ముగిసిన తరువాత అవసరమైన పోస్టల్ బ్యాలెట్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం యంత్రాల రెండో ర్యాండమైజేషన్ చేపట్టాలని సూచించారు. సీ విజిల్ యాప్‌ను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మీడియా సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ రోజు వచ్చే అప్పీల్స్‌పై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రూ.10లక్షల కంటే ఎక్కువ నగదు జప్తు చేస్తే ఐటీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని, సన్నద్ధంగా ఉండాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, అసిస్టెంట్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, డీఆర్‌డీవో కే శ్రీనివాస్‌కుమార్, డీపీవో నాగేశ్వర్‌రావు ఆర్‌డీవో రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్

## హుస్నాబాద్ అభివృద్ధిపై చర్చకు రావాలి

**జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్**

ఎల్కతుర్తి, అక్టోబర్ 30 : హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి జరుగలేదని పొన్నం ప్రభాకర్ మాట్లాడడం హాస్యాస్పదని, వెంటనే నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన చర్చకు రావాలని జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ సవాల్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం చరిత్ర పొన్నం ప్రభాకర్‌కు ఏమాత్రం తెలియదన్నారు. కరీంనగర్‌లో ఆదరణ లేకపోవడంతోనే రెండుసార్లు ఓటమి పాలయ్యాడన్నారు. అందుకే హుస్నాబాద్‌కు వచ్చి పోటీ చేస్తున్నారని విమర్శించారు. బీసీ ఓట్లు అని మాట్లాడే పొన్నం ప్రభాకర్, ఎంపీగా ఉన్నప్పుడు ఏం న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో కూడా డిపాజిట్ గల్లంతై డిసెంబర్ 3న కనపడకుండా పోతాడని జోస్యం చెప్పారు. తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కూడా కాంగ్రెస్ నాయకులేనని, స్వరాష్ట్రం ఏర్పాటు వల్ల జరిగిన జాప్యంలో కాంగ్రెస్ పార్టీ 1200 మంది ప్రాణాలను బలితీసుకుందని ఆరోపించారు. ఆ చావులకు కాంగ్రెస్ నైతిక బాధ్యత వహించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఇలాంటి పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎక్కడ అమలవుతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా ఒడితెల సతీశ్‌కుమార్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఆ దిశగానే ప్రజలందరూ పని చేసే ఎమ్మెల్యేను, ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ మేకల స్వప్న, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ తంగెడ నగేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, రైల్వే బోర్డు మెంబర్ ఎల్లూరి స్వామి, సొసైటీ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, రైతుబంధుసమితి కోఆర్డినేటర్ పోరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, మార్కెట్ డైరెక్టర్ తంగెడ మహేందర్, నాయకులు బచ్చు ఆనందం, కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, జూపాక జడ్సన్, గొడిశాల వినయ్ తదితరులు పాల్గొన్నారు.



గీతాలక్ష్మిని అభినందిస్తున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు, అధికారులు

## డాక్టర్ గీతాలక్ష్మి సేవలు మరువలేనివి

**డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు**

వరంగల్,అక్టోబర్ 30 : జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాలక్ష్మి సేవలు మరువలేనివని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు అన్నారు. ఉన్నత చదువుల కోసం వెళుతున్న ఆమెకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎంహెచ్‌వో పాల్గొని మాట్లాడుతూ ఐదేళ్లుగా గీతాలక్ష్మి అంకితభావంతో సేవలు అందించారన్నారు. కొవిడ్ లాంటి క్లిష్ట సమయంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. మిషన్ ఇంద్రధనుష్, సార్వత్రిక వ్యాధి నివారణ టీకాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యాకూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఉమాశ్రీ, మాస్ మీడియా అధికారి వేముల అశోక్ రెడ్డి, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్నకుమార్, ఫార్మసీ సూపర్‌వైజర్ చంద్రకళ, అధికారులు సుశీల, చంద్రశేఖర్, రమేశ్, దయాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేడు 'డయల్ యువర్ హనుమకొండ డీఎం'

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 30 : హనుమకొండ డిపో పరిధిలో మంగళవారం సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం బీ ధరమ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలావరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల పరిధిలోని ప్రజలు డిపో అభివృద్ధి, బస్సు సర్వీసులపై తమ అభిప్రాయాలను 99592 26049 నంబర్‌లో తెలియజేయాలని ఆయన కోరారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో జవహర్ రెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో

ధర్మసాగర్, అక్టోబర్ 30 : మండలంలోని రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీ జవహర్ రెడ్డి సూచించారు. మండలంలోని ధర్మసాగర్, శాయిపేట, క్యాతంపల్లి, ముప్పారం, సోమదేవరపల్లె గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్‌తో కలిసి ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఆయా గ్రామాల పరిధిలోనే విక్రయించుకునేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఏ గ్రేడ్ రకం రూ.2,203, బీ గ్రేడ్ రకానికి రూ. 2,183 ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో పద్మ, డీపీఎం అనిల్, ఏపీఎం అనిత, ఏఈవో రజిని, సీసీ కవిత, వీవోలు, వీవోఏలు పాల్గొన్నారు.

## 'రాష్ట్రస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలి'

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 30 : జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న జరిగే రాష్ట్రస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ యూత్ విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మేడిపెల్లి ప్రశాంత్ పిలుపునిచ్చారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బీసీలకు సముచితస్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో మేడిపెల్లి శ్రీకాంత్ పటేల్, అంజల శివ పాల్గొన్నారు.

## 'ఎంపీపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి'

వేలేరు, అక్టోబర్ 30 : మెదక్ ఎంపీ, దుబ్బాక నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బీఆర్‌ఎస్ వేలేరు మండల కోఆర్డినేటర్, కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కత్తితో దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇది కచ్చితంగా ఆయన ప్రత్యర్థుల కుట్రలో భాగమేనని, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## 'ఈటల' పట్టించుకోవడం లేదు

**బీజేపీకి మహిళా మోర్చా మండల అధ్యక్షురాలి రాజీనామా**

కమలాపూర్, అక్టోబర్ 30 : భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మాదారపు కవిత ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు సోమవారం తెలిపారు. మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన కవిత 15 సంవత్సరాలుగా బీజేపీలో పని చేస్తున్నారు. అయితే, తాను ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ కోసం పనిచేస్తే ఈటల రాజేందర్ బీజేపీలో చేరిన రెండేళ్లుగా మహిళ నాయకురాలిగా ఉన్నప్పటికీ తనను పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈటలకే ఆత్మగౌరవం దెబ్బతింటది కానీ, తనలాంటి వాళ్లకు ఆత్మగౌరవం దెబ్బతినదా? అని ప్రశ్నించారు. మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా ఉన్నప్పటికీ తాను ఎవరో తెలియకుండా ఈటల వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈటల రాజేందర్ ఒంటెద్దు పోకడతో పార్టీలో ఉండలేక పోతున్నట్లు తెలిపారు. బీజేపీలో పదిహేనేండ్లుగా పనిచేస్తున్న పట్టించుకోకపోవడంతోనే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీని వీడడం బాధకరమే అయినప్పటికీ ఈటల రాజేందర్ వ్యవహారంతో వైదొలుగుతున్నట్లు ఆమె తెలిపారు.



మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మాదారపు కవిత